సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 31 । జూలై । 2023



తొలకరి వ్యాధులతో అప్రమత్తం

తొలకరి వర్షాల కారణంగా పశువులు, గొర్రెలు, మేకల్లో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. 8లో



విద్యాప్రమాణాల మెరుగుకు..

విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ సూచించారు. 8లో



తిమ్మాపురంలో కేసు విచారణ

తిమ్మాపురంలో దళిత బాలుడితో పాటు మరో ఇద్దరిపై జరిగిన దాడి ఘటనపై ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు విచారణ చేపట్టారు. 8లో

న్యూస్‌రీల్

25 టన్నుల పశు దాణా పంపిణీ



కనకాయలంకలో రైతులకు దాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

యలమంచిలి : ముంపునకు గురైన కనకాయలంక, పెదలంక గ్రామాల్లో పాడి రైతులకు ప్రభుత్వం దాణా పంపిణీ చేసింది. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు చేతులమీదుగా పశుసంవర్ధక శాఖ అధికారులు పశువుకు 25 కిలోలు, గొర్ర, మేకకు 5 కిలోల చొప్పున 25 టన్నుల మిశ్రమ దాణా ప్యాకెట్లను ఆదివారం అందజేశారు. కనకాయలంకలో 400 పశువులకు, 500 గొర్రెలకు సంబంధించి 139 మంది రైతులకు 15 టన్నులు, పెదలంకలో 400 పశువులకు సంబంధించి 52 మంది రైతులకు 10 టన్నుల దాణా పంపిణీ చేశామని, గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని పశుసంవర్ధక శాఖ భీమవరం డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ జవార్ హుస్సేన్ అన్నారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి కె.మురళీకృష్ణ, పాలకొల్లు సహాయ సంచాలకులు జి.మల్లేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, గోపాలమిత్ర జి.ధర్మారావు పాల్గొన్నారు.

బీచ్‌లోకి ప్రవేశం లేదు

మొగల్తూరు: వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పాటు బంగాళాఖాతంలో వాయుగుండం హెచ్చరికల నేపథ్యంలో కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లను ఆదివారం మూసివేశారు. బీచ్‌లకు సందర్శకులను అనుమతించవద్దని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు డీఎస్పీ మనోహర ఆచారి ఆధ్వర్యంలో సీఐ సురేష్ నేతృత్వంలో మొగల్తూరు ఎస్సై వీరబాబు తన సిబ్బందితో బీచ్‌లో బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వ డ్రైవర్ల వినతి



రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులను సన్మానించిన దృశ్యం

ఏలూరు రూరల్: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ వాహనాల డ్రైవర్లకు సైతం ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం ఏలూరులోని సంఘం భవనంలో సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది పేదలకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు మంజూరు చేస్తున్న విధంగా డ్రైవర్లకు సైతం అందించాలని కోరారు. అనంతరం జీఓ నంబర్ 5 రద్దు చేయాలని, డ్రైవర్ల డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ ప్రభుత్వం మంజూరు చేసేలా కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గాన్ని కోరుతూ సభ్యులు తీర్మానం చేశారు.

నిలకడగా గోదావరి



యలమంచిలి: పెదలంక కాజ్‌వేపై వరద నీరు



పోడూరు: భీమలాపురం వద్ద కోతకు గురవుతున్న లంక ప్రాంతం

క్రమేపీ తగ్గుతున్న వరద

- పోలవరం ప్రాజెక్టు నుంచి 13.70 లక్షల క్యూసెక్కులు దిగువకు..
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- లంక ప్రాంతాలను తాకుతూ నీటి ప్రవాహం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గోదావరి వరద క్రమేపీ తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద ఆదివారం మధ్యాహ్నానికి 52.60 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. అయితే దిగువన కొంత ఉపనదుల నీరు కలుస్తుండడంతో పోలవరం ప్రాజెక్ట్ వద్ద 34.240 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. ఉదయం నుంచి భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుతున్నా పోలవరం ప్రాజెక్ట్ వద్ద స్వల్పంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి 13.70 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు చేరుతోంది. ఏలూరు జిల్లాలోని ముంపు మండలాలైన కుక్కునూరులో 10 గ్రామాలు, వేలేరుపాడులో 35 గ్రామాలు వరద బారిన పడ్డాయి. ఇక్కడ 12 పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో 36 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 464 మందికి వైద్య సేవలు అందించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట మండలంలో లంక గ్రామాలను తాకుతూ వరద ప్రవహిస్తోంది. యలమంచిలి మండలంలో మూడు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దొడ్డిపట్లలో ఏటిగట్టును తాకుతూ వరద ప్రవహిస్తోంది.

ఎర్రకాలువకు 881 క్యూసెక్కులు

జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెంలోని ఎర్రకాలువ జలాశయంలోకి గంటకు 881 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం నీటి మట్టం 83.50 కాగా ప్రస్తుతం 81.28 మీటర్లు ఉంది.

రాకపోకలపై నిషేధం

ఏలూరు మండలం కోమటిలంక గ్రామంలో నాగరాజు కోడు (పోలరాజు డ్రెయిన్) వద్ద కాజ్‌వేపై వరద నీరు ప్రమాదకర పరిస్థితిలో ప్రవహిస్తోంది. దీంతో ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్ కాజ్‌వేపై రాకపోకలు నియంత్రించి సహాయక చర్యలు చేపట్టారు.

ఏటిగట్లను తాకుతూ..



యలమంచిలి: దొడ్డిపట్లలో రాకపోకలకు సిద్ధం చేసిన పడవ



కనకాయలంకలో జలమయమైన కాలనీ

యలమంచిలి: మండలంలో గోదావరిలో వరద నిలకడగా ఉంది. కనకాయలంక, పెదలంక గ్రామాలకు వెళ్లే దారిలోని కాజ్‌వేలు, బాడవకి వెళ్లే రెండు ప్రధాన రోడ్లు నీటమునిగాయి. కనకాయలంక ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. పెదలంక, బాడవ ప్రజలు వరద నీటిలోనే ప్రయాణిస్తున్నారు. దొడ్డిపట్ల ఏటిగట్టు దిగువున ఉన్న మత్స్యకారకాలనీలో ఇళ్లు నీటమునిగాయి. ఇక్కడ కూడా పడవలపైనే రాకపోకలు సాగుతున్నాయి. దొడ్డిపట్ల ఏటిగట్టును తాకుతూ వరద ప్రవహిస్తోంది. ఏటిగట్టు పటిష్టతకు అధికారులు ఇసుక బస్తాలు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ ఇసుక ర్యాంపు పూర్తిగా వరదలో చిక్కుకుంది. లక్ష్మీపాలెంలో గోదావరి ఒడ్డున ఉన్న మత్స్యకార కాలనీ చుట్టూ వరద నీరు చేరింది. కాజ డ్రెయిన్ స్లూయిజ్ తలుపులు మూసుకోకపోవడంతో ఏనుగువానిలంక గ్రామంలోని పల్లపు వీధులు జలమయమయ్యాయి. సోమవారం వరద మరింత పెరిగే అవకాశం ఉందని తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ చెప్పారు. కోనసీమ జిల్లా తాటిపాక, దొడ్డిపట్ల గ్రామాల్లోని హైస్కూళ్లతోపాటు లక్ష్మీపాలెంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను పునరావాస కేంద్రాలు ప్రారంభించామన్నారు. వరద పెరిగిన వెంటనే బాధితులను అక్కడకు తరలిస్తామన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య, పశువైద్య శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు.

నరసాపురంలో ఉధృతంగానే..



నరసాపురం రూరల్ : కొత్తనవరసపురం ఎస్సీ కాలనీలోకి చేరిన నీరు



పాతనవరసపురంలో నీట మునిగిన ఆలయం



నరసాపురం రూరల్: నరసాపురంలో గట్టును తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణంలో ఆదివారం గోదావరి ఉధృతంగానే ప్రవహించింది. ఈ ప్రాంతంలో ఎటువంటి ప్రమాద సూచికలు లేకున్నా కాజ స్లూయిజ్ గేట్లు, అవుట్‌లెట్ల నుంచి కొత్తనవరసపురం ఎస్సీ కాలనీ, కాలనీకి వెళ్లే మార్గం, పాతనవరసపురంలో అమ్మవారి గుడి తదితర ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. నరసాపురంలో పంటు రాకపోకలు నిలిచిపోయాయి. నరసాపురం ప్రాంతంలో ఐదు తూముల వద్ద నుంచి పొన్నపల్లి వరకు గోదావరి ఉధృతంగానే ప్రవహిస్తోంది. పడవల రేవు, వలంధర్ రేవు, కొండాలమ్మ గుడి, శ్మశాన వాటిక ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టం పెరిగింది. మండలంలోని లక్ష్మణేశ్వరం, దర్భరేవు, రాజుల్లంక, మర్రితిప్ప, బియ్యపుతిప్ప ప్రాంతాల్లో వరద కొనసాగుతోంది. నరసాపురంలోని గోదావరి బండ్ వద్ద గోదావరిని వీక్షించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు వస్తున్నారు. రేవుల వద్ద పోలీసులు పహారా కాస్తున్నారు. పట్టణంలోని మిషన్ హైస్కూల్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కొత్తనవరసపురం ఎస్సీ కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరితే వారిని పునరావాస కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేశారు. నవరసపురంలో వైద్య శిబిరం కొనసాగుతోంది.

కోతకు గురవుతున్న లంక ప్రాంతాలు

పోడూరు: వశిష్ఠ గోదావరిలో వరద ఉధృతితో ఆచంట మండలంలో లంక గ్రామాల్లో వరద పెరిగింది. పుచ్చలంక, అయోధ్యలంక, అనగారిలంక, భీమలాపురం శివారు కాపులపాలెం గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. ఆయా గ్రామాల్లో బాధితులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు వరద సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులకు సూచనలిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు భోజన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకాధికారులు, రెవెన్యూ యంత్రాంగం సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

పునరావాస కేంద్రాల్లో మెరుగైన వసతులు

కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): పునరావాస కేంద్రాలను మెరుగైన వసతులతో సిద్ధం చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. యలమంచిలి, ఆచంట, నరసాపురం మండలాల్లోని 21 లోతట్టు గ్రామాలు ముంపునకు గురయ్యాయన్నారు. ఆయా గ్రామాల్లో 2,144 కుటుంబాలు ఉండగా 12,806 మంది నివసిస్తున్నట్లు తెలిపారు. నాలుగు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, 133 మంది గర్భిణులు, 138 మంది పిల్లల తల్లులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు, 25 మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 426 కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున 106.50 క్వింటాళ్ల బియ్యం, ప్రతి కుటుంబానికి కిలో చొప్పున కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళదుంపలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ నుండి ఐదు బృందాలు, 40 లైఫ్ జాకెట్లు సిద్ధం చేశామని, మొత్తం 20 బోట్లను సిద్ధం చేశామని తెలిపారు. శనివారం 50 వేల వాటర్ ప్యాకెట్లు, ఆదివారం 90 వేల వాటర్ ప్యాకెట్లను సరఫరా చేశామని పేర్కొన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు



కొత్తనవరసపురంలో వరద బాధితులకు ధైర్యం చెబుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: వరద ఉధృతి తగ్గుముఖం పట్టిందని, ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని, అన్నిరకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ముంపునకు గురైన కొత్తనవరసపురం ఎస్సీ కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. 90 కుటుంబాలకు బియ్యం, వంటనూనె, కందిపప్పు తదితర నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటుచేశామన్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశామని లోతట్టు ప్రాంతాల్లోని వారు తరలిరావాలని సూచించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం రూ.15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, అంద్రాజు చల్లారావు, మైలాబత్తుల శ్రీను, సర్పంచ్ ఈదా జగజ్జీవనరావు, ఎంపీటీసీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’కు సన్నద్ధం

- గ్రామస్థాయి నుంచి క్రీడా పోటీలు
- జిల్లాలోని 535 సచివాలయాల పరిధిలో ఏర్పాట్లు
- విజేతలకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులు



ఖోఖోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు (ఫైల్)

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో విద్యతో పాటు క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టింది. అక్టోబర్‌లో ప్రారంభం కానున్న పోటీలకు సంబంధించి జిల్లాలో ఏర్పాట్లు మొదలయ్యాయి. 17 ఏళ్ల పైబడిన యువతీ, యువకులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. జిల్లాలోని 535 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇన్‌చార్జుల నియామకం : గ్రామ, వార్డు స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు జిల్లాలోని 20 మండలాల్లో ఇన్‌చార్జ్‌లను నియమించారు. వీరి ద్వారా క్రీడా, పాఠశాల మైదానాలను ఎంపిక చేస్తారు. పాఠశాలల్లోని పీఈటీ, పీడీ, ప్రధానోపాధ్యాయుల వివరాలు సేకరించారు. అంపైర్ల వివరాలను ఈనెల 30లోపు నమోదు చేయనున్నాయి. జిల్లాస్థాయిలో అంబాసిడర్స్, అత్యుత్తమ క్రీడాకారులను ఎంపిక చేస్తారు.

గ్రామ, వార్డు స్థాయి నుంచి..

పోటీలను ముందుగా గ్రామ, పట్టణాల్లోని వార్డు స్థాయిల్లో నిర్వహిస్తారు. తర్వాత మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో నిర్వహిస్తారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విజేతలకు క్రీడాపరికరాలు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి విజేతలకు నగదు బహుమతులు అందిస్తారు.

జట్టు సభ్యులు ఇలా.. వాలీబాల్ జట్టులో 6 నుంచి 12 మంది, కబడ్డీ జట్టులో 7 నుంచి 12 మంది, ఖోఖో జట్టులో 9 నుంచి 12 మంది, క్రికెట్ జట్టులో 11 నుంచి 16 మంది, బ్యాడ్మింటన్ జట్టులో ఇద్దరు చొప్పున క్రీడాకారులు ఉంటారు. పోటీల ఇన్‌చార్జ్‌లుగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో తహసీల్దార్, ఎంపీడీఓ ఎంఈఓ, ఏఈ, ఈవోపీఆర్డీలు వ్యవహరిస్తారు.

విజేతలకు నగదు బహుమతులు

పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు (ప్రథమ), రూ.10 వేలు (ద్వితీయ), జిల్లాస్థాయిలో రూ.50 వేలు (ప్రథమ), రూ.30 వేలు (ద్వితీయ), రూ.20 వేలు (తృతీయ) అందించనున్నారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ విజేతలకు రూ.లక్ష (ప్రథమ), రూ.50 వేలు (ద్వితీయ), రూ.30 వేలు (తృతీయ) బహుమతులు అందిస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు రూ.5 లక్షలు (ప్రథమ), రూ.3 లక్షలు (ద్వితీయ), రూ.2 లక్షలు (తృతీయ)బహుమతులు అందిస్తారు.

పోటీల నిర్వహణకు కసరత్తు



ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. పోటీలను వచ్చే అక్టోబర్ 2న సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభిస్తారు. ఐదు రకాల క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడంతో ఎంతో మంది ఉత్తమ క్రీడాకారులు తయారవుతారు.

– ఎం.రమేష్‌బాబు, జిల్లా చీఫ్‌కోచ్, భీమవరం

చదువుతోనే పేదల స్థితిగతుల్లో మార్పు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



ఆరుగొలనులో గురుకుల పాఠశాల భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు మేరుగ నాగార్జున, కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్ : చదువుతోనే పేదల కుటుంబ స్థితిగతుల్లో మార్పు వస్తుందని, దీనిని గుర్తించిన ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఆరుగొలనులో రూ.22.17 కోట్లతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల భవనాలను డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ పరిపాలన అనే మహాయజ్ఞంలో చదువుకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. అంబేడ్కర్ ఆలోచనలను అమలు చేస్తున్నారన్నారు. కరోనా వంటి విపత్తు సమయంలోనూ సమర్థవంతమైన పాలన అందించారన్నారు. నాడు చంద్రబాబు హైదరాబాద్‌లో బొజ్జున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓట్ల కోసం చంద్రబాబు అర్రులు చాస్తున్నారని, 175 నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థిని నిలబెట్టలేని పరిస్థితుల్లో చంద్రబాబు ఉన్నాడన్నారు. కాపుల సంక్షేమానికి సీఎం జగన్ కృషిచేస్తున్నారని, ప్రపంచంలో ఉత్తమ వర్సిటీల్లో విద్యకు కాపు విద్యార్థులను సీఎం జగన్ పంపిస్తున్నారన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గురుకుల పాఠశాల, అంబేడ్కర్ భవనాల నిర్మాణ అంశాన్ని సబ్‌ప్లాన్‌లో ముందు వరుసలో తీసుకెళ్తానని ఆయన హామీనిచ్చారు.

గూడెంకు బృహత్తర పథకాలు: మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెంలో రాష్ట్రస్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దేలా 12 ఎకరాల విస్తీర్ణంలో స్టేడియం నిర్మాణం, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, చిన్న పిల్లల ఆస్పత్రి నిర్మాణానికి త్వరలో సీఎం జగన్ చేతులమీదుగా శంకుస్థాపన చేయనున్నామని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. చిన్న పిల్లల ఆస్పత్రి నిర్మాణానికి రూ.300 నుంచి రూ.350 కోట్లు ఖర్చవుతుందని అంచనా అన్నారు. అలాగే గూడెం నియోజకవర్గ అభివృద్ధికి ఆలోచన, అవగాహనతో ముందుకెళ్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ అభివృద్ధికి రూ.5.50 కోట్లు ప్రతిపాదనలు పంపామని, త్వరలో పనులు సాకారం కానున్నాయన్నారు. కాపు భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించామని, రూ.3 కోట్లు ప్రభుత్వం, మరో రూ.4 నుంచి రూ.5 కోట్లు కాపు పెద్దల నుంచి సేకరిస్తామన్నారు. కొందరు జనసేన నాయకులను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ కాపు భవన్ నిర్మాణం చేపడుతున్నామని, దీనిని కాపు సామాజికవర్గానికి ఇన్ఫర్మేషన్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామన్నారు. పెదతాడేపల్లి గురుకుల పాఠశాలకు సొంత భవనాల నిర్మాణానికి సహకరించాలని మంత్రి నాగార్జునను కోరారు. రూ.7 కోట్ల ఎఫ్‌డీఆర్ నిధులతో నవాబ్‌పాలెం నుంచి కొత్తూరు మీదుగా ఆరుగొలను గురుకులానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్లు నిర్మిస్తామని మంత్రి కొట్టు తెలిపారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం జగన్ కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడారు. తొలుత ప్రిన్సిపాల్ బీహెచ్ శ్రీనివాస్ పాఠశాల నివేదికను చదివి వినిపించారు. వసతిగృహాల జేడీ శోభారాణి, జిల్లా సమన్వయాధికారి ఎస్.భారతి, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేశ్వర్లు, ఎంఈఓ వి.హనుమ, పెదతాడేపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పోనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీలు సూర్పని రామకృష్ణ, కట్టా రంగబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాస్, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి


రైలు ఢీకొని మృతిచెందిన ఫ్రాన్సిస్

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో తేలప్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తిని గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెందాడు. తేలప్రోలు గ్రామానికి చెందిన కాటం ఫ్రాన్సిస్ రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనటంతో పట్టాల పక్కన పడి మృతిచెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ నండూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్మాగారాల్లో తనిఖీలు


తణుకులో కర్మాగారాల్లో తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖల అధికారులు

తణుకు: తణుకు పరిసర ప్రాంతాల్లోని పలు కర్మాగారాల్లో ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఆదివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రాసుగర్స్, వాస్‌బరీ, ప్లూటస్ కర్మాగారాల్లో ఆర్ఎస్, మిథనాల్ యూనిట్లు తనిఖీ చేసిన అధికారులు సంస్థ యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలను తనిఖీలు చేశారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఆర్ఎస్, మిథనాల్ విషయంలో అజాగ్రత్త వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేసి ట్యాంకర్లు దిగుమతి, ఎగుమతి సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో ఎస్ఈబీ జిల్లా అధికారి ఏటీవీ రవికుమార్, ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ, తణుకు ఎస్ఈబీ సీఐ ఆర్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా పరిధిలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అత్యాచార కేసులు, విచారణ పురోగతి పరిశీలన నిమిత్తం జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఏర్పాటులో భాగంగా సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు వి.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఐదుగురిని నియమించనున్నట్లు చెప్పారు. కమిటీ సభ్యుల కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. జిల్లాలో ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీలకు చెందిన అభ్యర్థుల దరఖాస్తులను ఆగస్టు 10 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గడువు తేదీలోగా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ కార్యాలయంలో అందజేయాలని, ఇతర వివరాలకు 96182 60778, 93816 07699 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

తొలకరి వ్యాధులతో అప్రమత్తం

- పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ
- ఇప్పటికే జబ్బ, చిటుకు వ్యాధులకు వ్యాక్సిన్

కైకలూరు: ఇటీవల భారీ వర్షాలకు లోతట్టు గ్రామాల్లో నీరు చేరింది. మనుషులతో పాటు పశువులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తొలకరి వర్షాల కారణంగా పశువుల్లో అనేక వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. గొర్రెలు, మేకల్లో కూడా వైరస్, బ్యాక్టీరియా వ్యాధులు చుట్టుముడతాయి. ఏలూరు జిల్లా విషయానికి వస్తే ఆవులు 1,36,549, గేదెలు 5,12,142, గొర్రెలు 5,26,836, మేకలు 1,98,810, పందులు 7,646 ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పశుసంవర్ధకశాఖ ఇటీవల పశువుల్లో వచ్చే జబ్బ వ్యాధి, గొర్రెల్లో వచ్చే చిటుక వ్యాధులకు టీకాలు వేశారు. వర్షాకాలంలో వచ్చే గాలికుంట వ్యాధి నివారణ వ్యాక్సిన్ల ప్రక్రియ కొనసాగుతోంది. వర్షాల నేపథ్యంలో పాడిపెంపకందారులు తీసుకోల్సిన జాగ్రత్తలపై కై కలూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పఠాన్ ముస్తాఫాఖాన్ జాగ్రత్తలు వివరించారు.

తొలకరిలో వచ్చే వివిధ వ్యాధులు నివారణ...

చిటుక వ్యాధి

గొర్రెలలో చిటుకు వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది. జీవాలు తూలుతూ నడుస్తాయి. ఇది బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తోంది. ఉన్నట్లుండి గాలిలో ఎగిరి చిటుకలో చనిపోతాయి. కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. మందలో 10 పైగా జీవాలు చనిపోతే చిటుకు వ్యాధి సోకినట్లుగా భావించవచ్చు. మందలో నీరసంగా ఉన్న గొర్రెలను మందల నుంచి వేరు చేయాలి. వ్యాధి నివారణకు పెన్సిలిన్ వేయించాలి. వ్యాధి సోకని గొర్రెలకు వ్యాక్సిన్ వేయించాలి.


గొంతువాపు సోకిన గేదె

నీలినాలుక వ్యాధి

నీలినాలుక వ్యాధి, గొర్రెలు, మేకల్లో వస్తోంది. వైరస్ వల్ల ఇవి వ్యాప్తి చెందుతాయి. ఈ వ్యాధి సోకిన జీవాల్లో జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోటి నుంచి సొంగ కారుస్తాయి. గిట్టలకు పుండ్లు ఏర్పడతాయి. ఆహారం తీసుకోకుండా, బలహీనంగా ఉంటాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు మంద నుంచి దూరంగా గుంపుగా ఉంటాయి. ఈ వ్యాధి నివారణకు యాంటీబయోటిక్స్, లివర్ టానిక్ ఉపయోగించాలి. వ్యాధి సోకిన జీవాలను వేరుచేసి, మిగిలిన వాటికి టీకాలు అందించాలి.

గొంతువాపు వ్యాధి

గొంతువాపు వ్యాధి బ్యాక్టీరియా వల్ల వ్యాప్తి చెందుతోంది. ఈ వ్యాధి అన్ని వయసుల గేదెలు, ఆవుల్లో కనిపిస్తోంది. వ్యాధి లక్షణాల విషయానికి వస్తే 105 నుంచి 106 డిగ్రీల జ్వరం కనిపిస్తోంది. నోటి నుంచి సొంగ కారుతోంది. అదే విధంగా నోటితో ఎక్కువగా గాలి పీల్చుకుంటాయి. మేత తీసుకోకుండా, గొంత వద్ద వాపు కనిపిస్తోంది. నివారణకు సల్ఫాడిమిడిన్ మందును ఉపయోగించాలి. నాలుగు నెలల దాటిన జీవాలకు కచ్చితంగా వ్యాక్సిన్ వేయించాలి.



గాలికుంటు వ్యాధి

ఇది వైరస్ వల్ల కలిగే వ్యాధి. ఇది ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు ఇలా జీవాలలో ఈ కనిపిస్తోంది. వ్యాధి లక్షణాల విషయానికి వస్తే నోటి, గిట్టలో పుండ్లు పడటం, ఎక్కువగా జ్వరం ఉంటుంది. ఈ వ్యాధి సోకిన చూడి పశువులు నాలుగు ఐదు నెలల్లో ఈసుకుపోతాయి. నివారణకు బోరిక్ గ్లిజరిన్ పేస్టును నోటిలో పుండ్లుకు పూతగా పూయాలి. పీపీ ద్రావణంతో కాలిగిట్ల మధ్య కడగాలి. యాంటీబయోటిక్ మందులు, లివర్ టానిక్ ఉపయోగించాలి. ప్రతీ ఏటా ఏప్రిల్, మే నెలల్లో వ్యాక్సిన్ చేయించుకోవాలి.

తొలకరిలో పాటించాల్సినవి..

- దాణాలు అందుబాటులో ఉంచుకోవాలి. తడిచిన దాణాలను పెట్టకూడదు.
- పశువుల షెడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఎండిగడ్డ తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మేతలను అధికంగా పెట్టకూడదు. గుంపుగా అన్నింటినీ ఒకే చోట కట్టవద్దు.
- వర్షాలు, వరదల సమయంలో జంతువులు చనిపోతే కాల్చడం, పూడ్చడం చేయాలి.
- యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ అందుబాటులో ఉంచుకోవాలి.
- వరదల కారణంగా గాయపడిన జీవాలకు తక్షణ వైద్య సేవలు అందించడానికి రిస్కు టీం అందుబాటులో ఉండాలి.
- పశువులకు ఆహారం, తాగునీటి అందుబాటులో ఉంచుకోవాలి.
- పశుసంవర్ధకశాఖ టోల్‌ఫ్రీ నెంబరు 1962కి కాల్ చేయాలి


డాక్టర్ పఠాన్ ముస్తాఫాఖాన్

మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌తో మంచి రోజులు


నూజివీడులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతోన్న ఎంఎస్ఎంఈ ఏడీ కేఎల్ఎస్ రెడ్డి

నూజివీడు: పట్టణంలో ఏర్పాటు చేయనున్న మామిడి ప్రాసెసింగ్ యూనిట్ వల్ల ఈ ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తోన్న మామిడికి మంచిరోజులు వచ్చినట్లేనని ఎంఎస్ఎంఈ ఏడి కేఎల్ఎస్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టు వ్యయం రూ.5 కోట్లు కాగా, ప్రభుత్వ రాయితీ 90 శాతం, స్వయం సహాయక సంఘాల కంట్రిబ్యూషన్ రూ.50 లక్షలని అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం స్వయం సహాయక సంఘాల మహిళలకు దీనిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్ఎస్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాసెసింగ్ యూనిట్‌లో మామిడి పొడిని తయారు చేస్తారని, తయారు చేసిన పొడిని దేశంలోని, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తామన్నారు. ఈ యూనిట్ ఏర్పాటుతో మామిడికి మంచి ధర లభిస్తుందని, రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. మామిడి కాయలను ఎక్కడికో ఎగుమతి చేయాల్సిన పని లేదని అన్నారు. అనంతరం కంట్రిబ్యూషన్‌ను అందించే లబ్ధిదారుల వెరిఫికేషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ కే సరళ, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం


పెంటపాడు: మౌంజిపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

వరద సహాయక చర్యలు ముమ్మరం

ఏలూరు(మెట్రో): జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయ పునరావాస కార్యక్రమాలలో అధికారులు అంతా పూర్తిగా నిమగ్నమై ఉన్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో వరద సహాయక కార్యక్రమాలు ఆదివారం వివరించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్య వేణి మాట్లాడుతూ గోదావరి వరద మూలంగా గత 10 రోజుల నుంచి జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాలలో ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. భద్రాచలంలో ప్రస్తుతం రెండవ ప్రమాద హెచ్చరిక ఉందని వరద తీవ్రత తగ్గిందన్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మొత్తం 45 ప్రాంతాలు వరదకు గురయ్యాయన్నారు. వేలేరుపాడులో 35, కుక్కునూరులో 10 చోట్ల వరద ముంపునకు గురికాగా.. రెండు మండలాల్లో 4,779 కుటుంబాలకు చెందిన 13,764 మంది ప్రజలు వరద బారిన పడ్డారన్నారు. వీరిలో 9,166 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. 12 వరద పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి, 4,275 మందికి పునరావాసం కల్పించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికి కావాల్సిన ఆహారం, తాగునీరు, శానిటేషన్ సమకూర్చామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలల్లో 36 మెడికల్ క్యాంపుల ద్వారా 464 మందికి వైద్య సదుపాయం కల్పించామన్నారు. 119 మంది గర్భిణీలను గుర్తించామని, వారిలో నాలుగు వారాల్లో ప్రసవానికి సిద్ధంగా ఉన్నవారిలో 9 మందిని సమీప సీహెచ్‌సీకి తరలించామన్నారు. రైస్ డిపోల ద్వారా మూడు నెలలకు సరిపడా నిత్యవసర వస్తువుల్ని పంపిణీ చేశామన్నారు. 11.69లక్షల వాటర్ ప్యాకెట్‌లను పంపిణీ చేశామన్నారు. రేషన్ బియ్యంతో పాటు మరో 25 కేజీల బియ్యం, కేజీ చొప్పున కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. అదే విధంగా ఏడున్నర కిలోల వివిధ రకాల కూరగాయలను కూడా అందిస్తున్నామన్నారు. 10 రోజులుగా సీనియర్ అధికారులు అక్కడే ఉండి, పునరావాస సహాయ చర్యలలో భాగంగా సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. జిల్లా, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూంలు నిరంతరం పనిచేస్తున్నాయన్నారు.


జేసీ బి.లావణ్యవేణి

దెబ్బతిన్న ఇళ్లకు రూ. 10 వేల చొప్పున సాయం

నీట మునిగిన గ్రామాలలో వరదల కారణంగా దెబ్బతిన్న కచ్చా, పూరి గుడిసెల ప్రజలకు ముఖ్యమంత్రి ఆదేశాల అనుసారం రూ.10 వేల చొప్పున అందిస్తామని, వరద తగ్గిన వెంటనే మండల స్థాయి ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందితో కూడిన బృందంతో ఇంటింటికి సర్వే చేస్తారన్నారు. బాధితులు తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ప్రతి కుటుంబానికి రూ.2 వేల చొప్పున అందిస్తామన్నారు. వేలేరుపాడుకు చెందిన 19 నివాసిత ప్రాంతాల వారు, కొండ ప్రాంతాలలో ఉన్నారని, అక్కడ వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. జనరేటర్ ఏర్పాటు చేశామన్నారు. టార్పాలిన్లు కూడా అందిస్తున్నామన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్న వారికీ భోజన సౌకర్యం కలిస్తున్నామని, కొంతమంది బయటకు వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నామని, తమకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందిస్తే తాము వండుకుంటామని కోరారని, ఆ మేరకు వారికి కూడా అందించామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇందుకోసం 142 మంది కార్మికులతో కూడిన 13 బృందాలను నియమించామన్నారు.

మర్చిపోయిన ఉంగరం భక్తుడి చెంతకు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం సిబ్బంది నిజాయితీ కారణంగా ఒక భక్తుడు పోగొట్టుకున్న బంగారపు ఉంగరం తిరిగి ఆ భక్తుడుకి చేరింది. వివరాల ప్రకారం శ్రీకాకుళంకు చెందిన ఎం.ఎ స్.ఎస్. శర్మ అనే భక్తుడు కొండపైన ధర్మఅప్పారాయ సత్రంలోని గదిలో తన బంగారపు ఉంగరాన్ని ఆదివారం మర్చిపోయాడు. అయితే గదిని శుభ్రపరిచే సమయంలో ఆ ఉంగరం స్వీపర్ల కంట పడటంతో దానిని గుమస్తా నాగార్జునకు అందజేశారు. అనంతరం ఆ విషయాన్ని గుమస్తా ఫోన్ ద్వారా తెలిపారు. ఆ తర్వాత సత్రం వద్దకు వచ్చిన సదరు భక్తుడు శర్మకు ఆ ఉంగరాన్ని ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు, గుమస్తా నాగార్జునలు అందజేశారు.


భక్తుడు శర్మకు ఉంగరాన్ని అందజేస్తున్న దృశ్యం

అదృశ్యంపై కేసు నమోదు

మండవల్లి: బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కానుకొల్లు గ్రామానికి చెందిన యువతి(17) ఈ నెల 27వ తేదీ రాత్రి 10 గంటల నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. లంకల కలవగుంట గ్రామానికి చెందిన యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

చాట్రాయి: ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం చింతలపూడికి చెందిన సుబ్బలక్ష్మి, నిహారిక తన ద్విచక్ర వాహనంపై చాట్రాయి వైపు వస్తున్నారు. చాట్రాయికి చెందిన నరసింహరావు తన ద్వి చక్రవాహనంపై చింతలపూడి వైపు వస్తుండగా మండలంలోని పోలవరం, చాట్రాయి గ్రామాల మధ్య రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సుబ్బలక్ష్మి, నిహారికలను 108 వాహనం ద్వారా చింతలపూడి ఏరియా ఆస్పత్రికి తరలించగా నరసింహరావుని 108 వాహనం ద్వారా నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు


తణుకు నుంచి పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్న భక్తులతో డిపో మేనేజరు సత్యనారాయణమూర్తి

తణుకు అర్బన్: అరుణాచలం, కంచి పుణ్యక్షేత్రాల దర్శనార్థం తణుకు ఆర్టీసీ డిపో నుంచి ఆదివారం రెండు ప్రత్యేక బస్సులు పంపించినట్లు డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. భక్తులు సోమవారం శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం పుణ్యక్షేత్రాలను దర్శించుకుని 1వ తేదీన అరుణాచలం గిరి ప్రదక్షిణ చేసుకుని రాత్రి కంచికి చేరుకుంటారని, 2వ తేదీన కంచిలోని ఆలయాల సందర్శన అనంతరం బయలుదేరి 3వ తేదీ ఉదయం తణుకు చేరుకుంటారని వివరించారు. ఆగస్టు 29న బయలుదేరే బస్సులకు సంబంధించి సోమవారం నుంచి రిజర్వేషన్ అవకాశం కల్పిస్తున్నామని, రిజర్వేషన్ కోసం 94404 19144, వివరాలకు 98491 69396, 73829 00132 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

సాక్షి, భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలోని జువ్వలపాలెం రోడ్డులో కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

భీమవరం టూటౌన్‌లోని ఒక అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. టి.సుధాకరరావు ఈనెల 24న ఒడిశా వెళ్లి ఆదివారం వచ్చి చూడగా వాహనం కనిపించలేదని ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్ సుందర్ సూచించారు. వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమ గోదావరి జిల్లా శాఖ నాయకులు ఆదివారం ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించడం కోసం ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులు అవలంభించాలని కోరారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాల పెంపుకోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొని నూతన బోధనా విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడానికి, తద్వారా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడానికి అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ టీఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. శ్యామ్ సుందర్‌ను కలిసిన వారిలో వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జీజే ప్రభువరం, గౌరవ అధ్యక్షుడు బొడ్డేటి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు పీవీ సత్యనారాయణ, కార్యదర్శి రాబర్ట్ మాథ్యూ, ఏలూరు జిల్లా పెదపాడు మండల అధ్యక్ష, కార్యదర్శులు కాటి వెంకట రమణ, ప్రకాష్ రాజ్, ఏలూరు మండల అధ్యక్షుడు పిట్ట ఫ్రెడ్రిక్ బాబు, అత్తిలి గ్రామ సర్పంచ్ గంట విజేత నాగరాజు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జీజేఏ స్టీవెన్ ఉన్నారు.


ఏలూరు డీఈఓ శ్యామ్ సుందర్‌ను కలిసిన వైఎస్ఆర్‌టీఫ్ జిల్లా నాయకులు

తిమ్మాపురంలో ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురంలో దళిత బాలుడితో పాటు మరో ఇద్దరిపై జరిగిన దాడి ఘటనపై ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు ఆదివారం విచారణ చేపట్టారు. అందులో భాగంగా ముందుగా ఆయన ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్‌తో కలిసి తిమ్మాపురంలోని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి వివరాలను సేకరించి సాక్షుల వద్ద స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. ఆ తర్వాత కొమ్మర గ్రామంలో ఒక ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి విచారణ జరిపారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. తిమ్మాపురానికి చెందిన అప్పసాని ధర్మారావు కోళ్ల మకాంలోని నాటుకోళ్లు ఇటీవల చోరికి గురయ్యాయని వాటిని దొంగిలించారన్న అనుమానంతో ధర్మారావు, అలాగే అదే గ్రామానికి కొనకళ్ల అప్పారావులు తనపై దాడి చేసినట్లు ఈనెల 27న ముప్పిన సురేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని డీఎస్పీ తెలిపారు. దానిపై అదే రోజు కేసు నమోదైందన్నారు. మరుసటి రోజు తిమ్మాపురం గ్రామానికి చెందిన దళిత బాలుడు మనెల్లి దుర్గాప్రసాద్ మరో ఫిర్యాదు చేశాడన్నారు. కోళ్ల దొంగతనం నెపంతో తనపైన, అలాగే ముప్పిన సురేష్, అరటికట్ల రాంబాబుపై ఈనెల 25న రాత్రి గ్రామానికి చెందిన అబ్బసారి ధర్మారావు, కొనకళ్ల అప్పారావు, ఆచంట రాకేశ్, ఘంటా శేఖర్, పోకల సిద్దిరాజు, మురుగుల దుర్గారావులు కర్రలు, ప్లాస్టిక్ పైపులతో దాడి చేశారని ఫిర్యాదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. తన మర్మాంగాలను కటింగ్ ప్లేయర్‌తో నొక్కారని దుర్గారావు ఫిర్యాదు చేశాడన్నారు. దాంతో అదే రోజు ఎఫ్ఐఆర్‌ను మార్చి నిందితులపై ఎస్సీ, ఎస్టీ, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టామని తెలిపారు. మర్మాంగాలను కటింగ్ ప్లేయర్‌తో నొక్కారా లేదా అన్నది వైద్యులు ధ్రువీకరించాల్సి ఉందన్నారు. త్వరితగతిన కేసు విచారణను పూర్తి చేస్తామని, అనంతరం నిందితులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు.


తిమ్మాపురంలో బాలుడి నుంచి వివరాలను సేకరిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు

నాటుసారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం

నూజివీడు: స్థానిక రూరల్ పోలీసులు నాటుసారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపారు. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తన సిబ్బందితో మండలంలోని సుంకొల్లులోని అటవీ ప్రాంతంలో ఆదివారం దాడులు నిర్వహించి సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 2 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో భాగంగా కాపుసారాను తయారు చేస్తున్న మూడు బట్టీలను కనుగొని పోలీసులు వాటిని ధ్వంసం చేయడంతో పాటు వాటి యజమానులపై కేసులు నమోదు చేశారు. కాపుసారా తయారు చేసేందుకు ఉపయోగించే సామగ్రిని స్వాధీనం పరుచుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రాజులపాటి అంకబాబు మాట్లాడుతూ కాపుసారాను తయారు చేసినా, విక్రయించినా, సరఫరా చేసినా చట్టప్రకారం నేరమని, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సారా గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని, చెప్పిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.


నూజివీడు మండలం సుంకొల్లులో పోలీసులు స్వాధీనం చేసుకున్న కాపుసారా తయారీ పాత్రలు

క్లుప్తంగా

అత్తిలిలో ఉచిత వైద్యశిబిరం



అత్తిలిలో వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: పట్టణంలో ఆదివారం సన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అత్తిలి గ్రామానికి చెందిన కొండే ప్రవీణ్ జ్ఞాపకార్థం స్నేహితులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా ప్రవీణ్ స్నేహితులు మాట్లాడుతూ ప్రవీణ్ ఎంతో సేవా గుణం కలిగిన వ్యక్తిఅని, అటువంటి వ్యక్తి మన మధ్యన లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వశిష్ట లియో క్లబ్ సేవలు అభినందనీయం



లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంలో సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న లియోక్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువత లయనిజం లో ఉంటూ అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని, వశిష్ట లియో క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డైమండ్స్ సభ్యులు కె.సాయి సత్యనారాయణ రాజు సౌజన్యంతో లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంలో విద్యార్థులకు స్నాక్స్, స్టేషనరీ, భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో లియో క్లబ్ సభ్యులు మాధురి, సంపత్, కె.లక్ష్మి, సతీష్, రాజేష్, యర్రా ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకు మేలు



మంత్రులకు వినతిపత్రం ఇస్తున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికైనప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమం అనే రెండు కళ్ల సిద్ధాంతంతో రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. తాడేపల్లిగూడెం మండలానికి విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రివర్యులు మెరుగు నాగార్జునకు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో చీకటిమిల్లి మంగరాజు వినతిపత్రం సమర్పించారు. మంగరాజు మాట్లాడుతూ ప్రభుత్వంచే రాష్ట్రంలోని రైతులకు, అన్ని వర్గాల వారికి విద్యా, ఆరోగ్యం, పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలు వంటి అనేక సంక్షేమాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను భారత కరెన్సీ నోట్లు మీద ముద్రించే విధంగా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అన్ని పథకాలు దళితులకు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెంటపాడులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనం పాల్గొన్న పూర్వపు విద్యార్థులు

పెంటపాడు: మండలంలోని ప్రభుత్వ బేసిక్ స్కూల్లో ఆదివారం 33 ఏళ్ల అనంతరం అపూర్వ విద్యార్థుల సమావేశం ఘనంగా జరిగింది. 1990–91 సంవత్సర కాలంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూల్లో చదువుకొన్న విద్యార్థులు 33 ఏళ్ల అనంతరం ఆత్మీయ కలయిక ద్వారా ఆదివారం కలుసుకున్నారు. ఎక్కడెక్కడో దూరప్రాంతాల్లో పలు ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడి ఉన్న వీరు ఈ సందర్భంగా కలుసుకొని తాము చదువుకొన్న పాఠశాలను సందర్శించారు. సహపంక్తి భోజనాలు చేశారు. పల్లారెడ్డి, మధు, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, దేవాబత్తుల బాబి పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

కాళ్ల: వేర్వేరు ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై దాడి చేసి 7 మందిపై కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కాళ్ల మండలం దొడ్డనపూడి, సీసలి గ్రామాల్లో పేకాట ఆడుతున్నరనే సమాచారం మేరకు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి సిబ్బందితో కలిసి దాడి చేశారు.

ముమ్మరంగా పైపులైన్ ఏర్పాటు పనులు

- ఇకపై మరింత మందికి సురక్షితమైన తాగునీటి సరఫరా
- రూ. 54 లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభం



తణుకులో పైపు లైన్ నిర్మాణానికి రోడ్డు మార్జిన్ తవ్వుతున్న దృశ్యం



తణుకులో పైపులైన్ నిర్మాణం చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్ : పురపాలక సంఘ పరిధిలో ప్రజానీకానికి సురక్షితమైన తాగునీరు అందించే క్రమంలో పైపు లైన్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మార్కెట్ విక్రయాలు నిర్వహిస్తున్న ప్యూరిఫైడ్ వాటర్ ఆరోగ్యానికి హానికరమని వైద్యులు చెబుతున్న తరుణంలో ప్రజానీకం మునిసిపాలిటీ సరఫరా చేస్తున్న తాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. తణుకులో ఇప్పటికే గోదావరి నీరు కాలువ ద్వారా పైపు లైన్‌లనుంచి ఫిల్టర్ బెడ్‌లకు చేరుతుంది. అక్కడ నుంచి పట్టణ పరిధిలో ఉన్న వాటర్ ట్యాంక్‌లకు చేరి కుళాయిల ద్వారా సరఫరా అవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగపరుస్తూ తణుకులో మరింత మందికి తాగునీరు అందించేందుకు పైపు లైన్‌లు లేని ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు గతంలో మాదిరిగా కాకుండా ఆధునిక పద్ధతిలో పైపులైన్ నిర్మాణాలు చేపట్టారు. పురపాలక సంఘ పరిధిలోని 34 వార్డుల్లోను పైపు లైన్‌లు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఈ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

రూ. 54 లక్షలతో 4 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణం

మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో 15వ వార్షిక నిధులు రూ. 44 లక్షలు, జనరల్ ఫండ్స్ 10 లక్షలతో 4 కిలోమీటర్ల మేర పనులు 7 టెండర్ల ద్వారా చేపట్టారు. ఇందుకోసం సీసీ రోడ్డు నిర్మాణాల ప్రాంతాల్లో సైతం మార్జిన్‌లో తవ్వి మరల సీసీ పనులు పూర్తి చేస్తున్నారు. ఇప్పటివరకు తణుకు మునిసిపాలిటీ పరిధిలో సుమారుగా 60 కిలో మీటర్ల మేర పైపు లైన్ విస్తరించి ఉండగా 4వేలకు పైగా బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువనున్న) కనెక్షన్‌లు, 2వేలకు పైగా కమర్షియల్ కుళాయిలు అందుబాటులో ఉన్నాయి. పైపులైన్ అందుబాటులో ఉన్న ప్రాంతాలతో పాటు నూతనంగా పైపు లైన్ అందుబాటులోకి వస్తున్న ప్రాంతాల్లో సైతం రైస్ కార్డు ఉన్న వారికి రూ. 200లకే కుళాయి కనెక్షన్ ఇస్తామని, కమర్షియల్ కనెక్షన్‌కు సుమారుగా రూ. 8వేలు వరకు మునిసిపాలిటీకి చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పైపు లైన్‌లు నిర్మాణాలు చేసి కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాలంటూ గత ప్రభుత్వ హయాం నుంచి మునిసిపల్ కార్యాలయాలకు తిరుగుతున్న ప్రజలకు నూతనంగా నిర్మిస్తున్న పైపు లైన్‌ల ద్వారా ఇళ్లలోకి సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రానుంది.

సురక్షితమైన తాగునీరు అందించేందుకే



తణుకు పురపాలక ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించే క్రమంలో పట్టణ పరిధిలో 4 కిలో మీటర్ల మేర పైపు లైన్ నిర్మాణ పనులు చేస్తున్నాం. 15వ వార్షిక నిధులతోపాటు జనరల్ ఫండ్స్ నిధులు కూడా వెచ్చించి పైపు లైన్ నిర్మాణాలు చేపట్టాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు బీపీఎల్ వారికి రూ. 200లకే కుళాయి కనెక్షన్ అందచేస్తాం.

– కేటీ సుధాకర్, తణుకు మునిసిపల్ కమిషనర్

మంత్రి కారుమూరి చొరవతో



మా 18వ వార్డులో పురపాలక సంఘం సరఫరా చేసే తాగునీటి కోసం చాలా ఏళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సమస్యను గుర్తించి వారిచ్చిన ఆదేశాల మేరకు అధికారులు మా వార్డులో నూతనంగా పైపు లైన్ నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలు పూర్తి అయిన తరువాత ప్రజలు కుళాయి కనెక్షన్ పెట్టించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

– సప్పా బలరామకృష్ణ, 18వ వార్డు ఇన్‌చార్జ్, తణుకు

నేడు కళాకారుల సంఘ వార్షికోత్సవం



ఆహ్వాన పత్రాలు విడుదల చేస్తున్న రంగస్థల కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 43వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 31వ తేదీ సోమవారం స్థానిక నల్లజర్ల రోడ్డులోని మాగంటి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీ, కోశాధికారి తగరపూడి మురళీకృష్ణలు తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వార్షికోత్సవ వేడక ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపం నుంచి స్థానిక కళాకారులచే శక్తి వేషాలు, కోలాట భజనలు, సన్నాయి మేళాలతో ఊరేగింపు జరుగుతుందన్నారు. మాగంటి సభా ప్రాంగణంలో మధ్యాహ్నం సంకీర్తనలు, శక్తి నృత్యాలు, ఏకపాత్ర, మ్యాజిక్, జానపద గీతాలు, కూచిపూడి నృత్యాల ప్రదర్శనలు, సభ, సేవా కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. ఉపాధ్యక్షుడు మాసా బాబూరావు, ఏలూరి జగదీష్, కార్యదర్శి జేకే కృష్ణలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- మౌంజీపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



మౌంజీపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పెంటపాడు మండలంలో ఆదివారం మౌంజీపాడు, ఉమామహేశ్వరం, కె. పెంటపాడు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యకమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వారికి అందుతున్న లబ్ధి పొందుతున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సొంత పార్టీ కోసం కష్టపడటం మాని, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు కొమ్ము కాస్తూ ఆయన ఉక్కు కౌగలిలో ఉన్న పవన్ తక్షణం భయటకు రావాలని హితబోధ చేశారు. సజావుగా సాగుతున్న ప్రభుత్వ పాలనపై పలు విమర్శలు చేసి తన గొయ్యి తానే తవ్వుకొంటున్నాడన్నారు. పవన్ కల్యాణ్‌ను పావుగా చంద్రబాబు వాడుకొంటున్నాడని విమర్శించారు. 14 ఏళ్ల చంద్రబాబు హాయంలో రాష్ట్రానికి ఏలిన నాటిశని పట్టిందన్నారు. చందబాబు ఎల్లో బ్యాచ్ కుట్రలో పవన్ ఇరుక్కున్నాడన్నారు. సినిమాల్లో పవర్‌స్టార్‌గా ఎదిగిన పవన్ రాజకీయాల్లో మాత్రం చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతున్నాని మంత్రి విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన అన్ని వాగ్దానాలు 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, సర్పంచ్‌లు మైలవరపు స్వర్ణలత, మద్దుకూరి నాగేశ్వరరావు, సగర, కళింగ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు కర్నాటి కన్నయ్య, సంపతరావు కృష్ణారావు, సొసైటీల అధ్యక్షుడు గుండు మోగుల సాంబయ్య, కళిరెడ్డి అబ్బాయి, దేవ వెంకటరమణ, గృహసారథుల మండల కన్వీనర్ మైలవరపు పెదబాబు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ జామికృష్ణ, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, రెడ్డి సూరిబాబు, ములగాల బాబ్జి, కైగాల గణపతి, మట్టా సత్యనారాయణ, పార్టీ నాయకులు బోణం వీరయ్య, పసల చంటి, తహసిల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, ఎంఈవో శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఏఈ నవీన్, ఏవో సారథి, పలు శాఖల ఏఈలు, సిబ్బందితో పాటు, గ్రామాల నాయకులు మారిశెట్టి ధర్మారావు, పోతుల లింగయ్య, ఎంపీటీసీ సభ్యుడు నంద్యాల వెంకన్నబాబు, లక్కదాసు నరసింహమూర్తి, ఖండవల్లి నవీన్, తాడిశెట్టి వెంకటేశులు, లీగల్ సెల్ కన్వీనర్ హరిదాసు రవీంద్ర, మౌంజీపాడు, కె. పెంటపాడుకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు గ్రామాలకు విస్తరించాలి



అత్తిలి మండలం కొమ్మరలో మానవత సంస్థ సభ్యత్వాలను స్వీకరిస్తున్న దృశ్యం

అత్తిలి: మానవత సేవలు అత్తిలి పరిసర గ్రామాలకు విస్తరించాలని మానవత రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి అన్నారు. మానవతా అత్తిలి యూనిట్ ఆధ్వర్యంలో కొమ్మర గ్రామంలో మానవతా అవగాహన సమావేశం మండల అధ్యక్షుడు బోడపాటి సూర్యచంద్రరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాధాపుష్పావతి మాట్లాడుతూ అత్తిలి గ్రామంలో 2021లో మానవత యూనిట్‌ను స్థాపించామన్నారు. కొమ్మర గ్రామస్తులు సభ్యత్వాలు తీసుకోవాలని, దీనిద్వారా సంస్థ బలోపేతం అవుతుందన్నారు. జిల్లా కమిటీ సంయుక్త కార్యదర్శి బోయపాటి రామలక్ష్మి మాట్లాడుతూ 2004లో స్థాపించిన మానవతలో 108 సభ్యులు మాత్రమే ఉన్నారని, నేడు అన్ని జిల్లాలకు విస్తరించి 50 వేల మంది సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నారన్నారు. మానవత సంస్థ అభివృద్ధికి తమ పూర్తిసహాయ సహకారాలు అందిస్తామని ఉపసర్పంచ్ మన్యం దానారావు, గ్రామప్రముఖులు గుడిమెట్ల సత్యరెడ్డి తెలిపారు. అత్తిలి యూనిట్‌కి కొత్తగా 35 మంది సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి యూనిట్ కన్వీనర్ సుబ్బారావు, కో చైర్మన్ కంకటాల సతీష్, కుక్కల వెంకట సుబ్బారావు, చిన్న, రమణి, ద్వారంపూడి సుబ్బిరెడ్డి, మళ్ల శివరామకృష్ణ, ముత్యాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశంచౌక్): పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని సోమవారం సాయంత్రం స్థానిక మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించనున్నట్టు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణుడు కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 15 సంవత్సరాలలోపు చిన్నారులకు ఈ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సాయం అందిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్లు 99490 93115, 94408 59700లో సంప్రదించాలని కోరారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించాలి



మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులకు నిరసనగా తణుకులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టి శాంతి నెలకొనేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని క్రైస్తవ మైనారిటీ నాయకుడు మేడిద జాన్సన్ కోరారు. ఆదివారం సాయంత్రం క్రైస్తవ యూసీఏ, మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన శాంతి ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. మూడు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసా కాండను ప్రజాస్వామిక వాదులంతా ఖండించాలని కోరారు. మణిపూర్‌లో హింసకు పాల్పడిన వారిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, క్రైస్తవులకు రక్షణ కల్పించి లౌకిక రాజ్యాన్ని కాపాడాలని కోరారు. యూసీఏ జిల్లా అధ్యక్షుడు ఎంజే ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మణిపూర్ సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. దేశంలో మణిపూర్‌లో మారణకాండకు కారకులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. తణుకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమై రాష్ట్రపతి రోడ్డు మీదుగా నరేంద్ర సెంటర్‌లో మానవహారం నిర్వహించి వెంకటేశ్వర సెంటర్ వరకూ సాగింది. ఈకార్యక్రమంలో యూసీఏ అధ్యక్షుడు మనోజ్ బాబు, స్వరూప్ దత్, మత్రే అబ్రాహం, జెన్ను, మధు, పీ జయరాజు, వేణు, మురాల సుదాకర్, డాక్టర్ హుస్సేన్ అహ్మద్, నీలం మాల్యాద్రి, ఖాన్, డాక్టర్ కే ఆనంద్, నిరీక్షణరావు, వికే విక్టర్, ఆగమనరావు, పేరూరి మురళీ కుమార్, అంబేడ్కర్, జాన్ లివింగ్‌స్టన్, కోటిపల్లి లాజరస్, వర్మలతో పాటు తణుకు, ఇరగవరం, అత్తిలి, పెనుగొండ, పెరవలి, ఉండ్రాజవరం, పరిసర మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన క్రైస్తవ, ముస్లీం మైనారిటీ నాయకులు, న్యాయవాదు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడిని సత్కరించిన మంత్రి కారుమూరి



తణుకులో సత్యరాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పార్టీపట్ల విధేయతగా ఉండి పార్టీ అభివృద్ధికి పాటుపడిన వారికి వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేస్తుందని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ పరిశీలకులుగా నూతనంగా నియమించబడిన జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్‌ను ఆదివారం పార్టీ కార్యాలయంలో మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానాలకు అనుగుణంగా నియోజకవర్గంలో అన్ని వర్గాల వారికి పదవులను అందిస్తున్నట్లు చెప్పారు. సత్యరాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతిగా బీసీలు కొలవాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి కారుమూరి సిఫార్సు మేరకు తణుకు నియోజకవర్గ పరిశీలకుడిగా పదవిని అందజేశారని, నా బాధ్యతను పార్టీ కోసం పనిచేస్తానని చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, కర్రి కాశీరెడ్డి, గుబ్బల సూర్యచంద్రరావు, మారిశెట్టి శివశంకర్, పోతుల సోమేశ్వరరావు, తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

12 మంది వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ఆదివారం 12 మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలుమహేంద్రలు సంచార వైద్యశాల ద్వారా తణుకు, వేల్పూరు గ్రామాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని స్థితిలో ఉన్న 12 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సంఘ సభ్యురాలు వడ్లమాని పార్వతి ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాదికారి అర్జి బాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం అడ్డుకోవడం దారుణం



వేల్పూరులో మూడో రోజు రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న గ్రామ టైలర్స్ యూనియన్, రజక సంఘం సభ్యులు

తణుకు టౌన్: వేల్పూరు బీసీ కులాల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన సొమ్ములను చెల్లించకుండా టీడీపీ నాయకుల కోర్టులను ఆశ్రయించడం దారుణమని తణుకు మండల పరిషత్ అధ్యక్షుడు రుద్ర ధనరాజు చెప్పారు. వేల్పూరు గ్రామంలో బీసీ కులాలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన సొమ్ములను చెల్లించకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా ఆదివారం మూడో రోజు రిలేనిరాహార దీక్షలు కొనసాగాయి. వేల్పూరు గ్రామంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో గ్రామానికి చెందిన రజకులు, టైలర్స్ యూనియన్ సభ్యులు దీక్షలు చేపట్టారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న డీసీఎంఎస్ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు మాట్లాడుతూ వేల్పూరు వంటి పెద్ద గ్రామంలో బీసీ కులాలకు ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణం అవసరమన్నారు. రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వేల్పూరులో గ్రామంలో ఇప్పటి వరకూ టీడీపీ నాయకులు నీచ రాజకీయాలు చేశారని, అయితే ఇక నుంచి వాటిని సాగనివ్వమని తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వేల్పూరు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, ఇరగవరం, అత్తిలి ఎంపీపీలు కె మంగతాయారు, ఎం సూర్యనారాయణ, ఇరగవరం జెడ్పీటీసీ సభ్యులు పంపన అంజిబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అబీబుద్దీన్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ భరణి ప్రసాద్, పైబోయిన సత్యనారాయణ, కె దుర్గా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు చంద్రు శ్యామల, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, వేల్పూరు సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న,రెడ్డి సత్తిరావు, ఎంపీటీసీలు రెడ్డి హైమా, విజయ దుర్గ, వెంకట లక్ష్మీ, మెట్ల కిరణ్మయి, బొల్లా పద్మావతి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, కోనాల సర్పంచ్ మల్లిపూడి చిన్నయ్య, ముద్దాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మగంటి సత్యనారాయణ, వేల్పూరు రజక సంఘం అధ్యక్షుడు అవిడి శ్రీనివాసు, మల్లేశ్వరపు నరసింహమూర్తి, కుప్పాల సుబ్రహ్మణ్యం, టైలర్స్ యూనియన్ నాయకులు ఆయా సంఘాల సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.